


కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఆదివారం జరిగిన ప్రధాన ఆలయ చతుర్వేద హవన సహిత మహాకుంభాభిషేకం సందర్భంగా రాత్రి స్వామివారికి తిరుకళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# వైభవంగా మహాకుంభాభిషేకం

## కాణిపాకం ఆలయ సర్వదర్శనం మధ్యాహ్నం 12 నుండి ప్రారంభం -కిక్కిరిసిన భక్తజనం





కుంభాభిషేకంకు కలశాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న రుత్వికులు, ఆలయ పునర్నిర్మాణ దాతలు, ఆలయ అధికారులు, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, శక్తి నారాయణి అమ్మన్

కాణిపాకం, ఆగస్టు 21 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఆదివారం ప్రధాన ఆలయ చతుర్వేద హవన సహిత మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. దాతలు ప్రవాస భారతీయులైన ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్‌ల సహకారంతో సుమారు 10 కోట్లు రూపాయల వ్యయంతో చేపట్టిన ప్రధాన ఆలయంను పునర్నిర్మాణ పనులు పూర్తికావడంతో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబుల ఆధ్వర్యంలో ఆదివారం చతుర్వేద హవన సహిత మహా కుంభాభిషేకంను శాస్త్రోక్త ంగా నిర్వహించారు. ఈమేరకు ఈనెల 15 నుండి ఆలయంలో కుంభాభిషేకం పూజలు ప్రారంభం కాగా ఆదివారం ఉదయం 8 గంటల నుండి 9 గంటల మద్య శుభ కన్యాలగ్నమందు విమాన గోపురం , ధ్వజస్థంభం, తూరు ్ప, పశ్చిమ రాజగోపురాలకు మహా కుంభాభిషేకంలను నిర్వహించారు. తమిళనాడు వేలూరు శ్రీపురం స్వర్ణ దేవాలయం వ్యవస్థాపకులు శక్తి నారాయణి అమ్మన్ చేతుల మీదుగా కుంభాభిషేకం మహోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలోని ఉదయం యాగశాలలో కుంభాభిషేకం దీక్షాపూజలు, మహాపూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే కలశాద్వాసన పూర్తయిన అనంతరం యాగశాలలోని కలశాలను ఆలయ మాడావీదుల గుండా ఊరేగింపుగా ఆలయలోకి తీసుకువచ్చి కలశాలలోని పవిత్రజలంతో విమాన గోపురం , ధ్వజస్థంభం, తూరు ్ప, పశ్చిమ రాజగోపురాలకు ఏకకాలంలో రుత్వికులు, అర్చకులచే మహా కుంభాభిషేకంలను నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామివారి మూల విరాట్‌కు కూడా యాగశాలలోని కలశాల పవిత్రజలంతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకపూజలు చేసి దూపదీప నైవేద్యాలను సమరి ్పంచారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులకు దర్శనం కల్పించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి, భూగర్బ గనులు, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి ఆర్‌కె.రోజా, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, దేవాదాయశాఖ కమీషనర్ హరి జవహార్‌లాల్, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జడ్పీ ఛైర్మన్ జి.శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెలే ్యలు ఎంఎస్.బాబు, ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి, ఆలయ పునర్నిర్మాణ దాతలు గాయత్రీదేవి, ఐకా రవి, జానకి, గుత్తికొండ శ్రీనివాస్, పద్మజ, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ దంపతులు, బంగారు ధ్వజస్థంభం నిర్మాణ దాత హైదరాబాద్‌కు చెందిన మణి, ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు, ఈఈ వెంకట నారాయణ, కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఏసీ కస్తూరి,ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, పాలకమండలి సభ్యులతో పాటు వేదపండితులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా దేవస్థానం, పలువురు దాతల ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార ్యక్రమాలను నిర్వహించారు. సుమారు 15 వేల మందికి పైగా భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ చేశారు.

కికి ్కరిసిన భక్తజనం

కాణిపాకం ఆలయంలో జరిగిన మాహాకుంభాషేకం సందర్భంగా భక్తులతో ఆలయం కికి ్కరిసింది. ఆలయ భద్రత దృష్ట్యా జిల్లా కలెక్టర్ హరినారాయణన్, ఎసీ ్ప రిషాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆలయంలోకి కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొనేందుకు పరిమిత సంఖ్యలో అనుమతించారు. ఆలయంలో చేపట్టిన ప్రతే ్యక అలంకరణలు ఎంతో ఆకట్టుకున్నాయి. అదేవిధంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో అలరించాయి. ఆలయం వద్ద ప్రముఖ గాయని మంగ్లీచే పాటకచ్చేరి ఏర్పాటు చేశారు.

## మరమగ్గాల కార్మికులకు
# రెండో విడత నిధులు పంపిణీ



మరమగ్గాల కార్మికులకు చెక్ అందిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త :

నగరి నియోజకవర్గంలోని మరమగ్గాల కార్మికులకు యూనిఫామ్ దుస్తుల తయారీ కోసం రెండో విడతగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా ఆదివారం 2 కోట్ల, 91 లక్షల, 35 వేల రూపాయలను ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో పంపిణీ చేశారు. కరోనా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న మరమగ్గాలను ప్రోత్సహించాలనే ఉద్ధేశ్యంతో మంత్రి రోజా స్వయంగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని కలిసి సమస్య వివరించి పాఠశాల విద్యార్థులు ధరించే యూనిఫామ్ దుస్తుల తయారీ కాంట్రాక్టును మంజూరు చేయించారు. మొత్తం 19 లక్షల 98 వేల మీటర్ల దుస్తుల తయారీ కోసం 10 కోట్ల, 72 లక్షల, 59 వేల రూపాయలను మంజూరు చేయించారు. ఇందులో తొలి విడతగా 14.48 లక్షల మీటర్ల దుస్తుల తయారీ కోసం 7 కోట్ల 81 లక్షల 24 వేల రూపాయలను గతంలో మంజూరు చేశారు. రెండో విడతగా 5.50 లక్షల మీటర్ల దుస్తుల తయారీకి 2 కోట్ల 91 లక్షల 35 వేల రూపాయలను మంజూరు చేయించి వారికి పంపిణీ చేశారు. ఆ మేరకు 2.92 కోట్ల రూపాయల చెక్‌ను కార్మికులకు అందించారు. ఈ సందర్భంగా మరమగ్గాల కార్మికులు మంత్రికి రాయలసీమ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కె.సెల్వమణికి కృతజ్ఞతలు తెలిపారు.

రోజా సెల్వమణి వివాహ వేడుకలు

నగరిలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా, సెల్వమణి వివాహ వార్షిక వేడుకలను స్థానిక నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి కార్యాలయంలో రోజా, సెల్వమణి దంపతులతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంట పొలాలపై ఏనుగుల దాడి



చంద్రగిరి, ఆగ్టు 21 ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఆరేపల్లి రంగంపేట, దుర్గం కాలనీ ఎస్టీ కాలనీ వద్ద పంట పొలాలపై ఏనుగులు దాడిచేసి భీభత్సం సృష్టించడంతో రైతులకు నష్టం వాటిల్లింది. దుర్గం కాలనీకి చెందిన రైతులు సిద్దప్ప, కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, వాసు రెడ్డి, ఉమాపతి తమ వ్యవసాయ భూమిలో మామిడి, వరి, అరటి, పశుగ్రాసం వంటి పంటలను పండిస్తున్నారు. శేషాచల అడవుల నుండి ఏడు ఏనుగుల గుంపు రైతుల పంట పొలాలపై పడి ఫెన్సింగ్‌ను కూల్చి పంటలను, పైప్‌లైన్లను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆదివారం వేకువజాము వరకు ఎఫ్ఆర్ఓ దత్తాత్రేయ, ఎఫ్‌బిఓ రవి, రెడ్డెప్ప, సంపత్, బేస్ క్యాంప్ సిబ్బంది, ట్రెక్కింగ్ ఫోర్స్ రైతుల పంట పొలాల వద్దకు చేరుకుని అతి కష్టంపై ఏనుగుల గుంపును అడవిలోకి తరిమేశారు. మరోమారు ఏనుగుల దాడి జరగకుండా నిలువరించడానికి ఆదివారం సాయంత్రం అటవీశాఖ అధికారులు రెండు బృందాలుగా విడిపోయి కళ్యాణీ డ్యామ్, ఫిల్టర్ హౌస్ వద్ద భాణాసంఛా పేళుళ్ళతో శబ్దాలను చేయించారు. తమకు పంట నష్టం అందించి సాయం చేయాలని రైతులు కోరుతున్నారు.


## సిలెండర్ల పరిశ్రమతో వేయిమందికి ఉపాధి

-ఎంపి మిధున్‌రెడ్డి

4లో

# 2024కు సిద్ధమవుతున్న నేతలు

## పుంగనూరు "దేశం" అభ్యర్థి చల్లా !
## -రెండు జిల్లాల్లో పోటీ అవకాశం ఎవరికో!?




*ప్రభాతవార్త-తిరుపతి:*

*2024 ఎన్నికలకు ఏడాదిన్నరముందే చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రాజకీయం వేడెక్కుతోంది. ఈ ఎన్నికలకు టిడిపి అధినేత, జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. తాజాగా నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌ఛార్జిలు, సమన్వయకర్తలతో నిర్వహించిన సమీక్షలో అన్నమయ్య,కడప జిల్లాలతోబాటు చిత్తూరుజిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం అభ్యర్థిని ప్రకటించడం విశేషం. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 14 నియోజకవర్గాలు ఉండేవి. అయితే ఐదునెలలక్రిందట జిల్లాల పునర్విభజన తరువాత చిత్తూరుజిల్లా నుంచి పీలేరు, వాయల్పాడు, మదనపల్లి, తంబళ్ళపల్లి నియోజకవర్గాలు రాజంపేట పార్లమెంట్‌లో అన్నమయ్యజిల్లాలో కలిశాయి, దీంతో చిత్తూరుజిల్లాలో ఉన్న నియోజకవర్గాల్లో తొలుత పుంగనూరు స్థానం అభ్యర్థిగా చల్లారామచంద్రారెడ్డి పేరును చంద్రబాబు పార్టీనుంచి ముందుగానే ప్రకటించారు. ఇక్కడ ఉమ్మడి చిత్తూరుజిల్లాలో పుంగనూరు నియోజకవర్గంనుంచి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు, ఆ తరూవాత 2014,2019 ఎన్నికల్లోనూ వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ తరపున ప్రస్తుత మంత్రి, సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తూ పలు దఫాలు ఆయన విజయం సాధిస్తున్నారు. ఈ సమయంలో 2024 ఎన్నికలకు సమాయత్తమయ్యేందుకు ప్రతిపక్ష తెలుగుదేశం ఇప్పటినుంచే కసరత్తు మొదలుపెట్టింది. ముందుగా పుంగనూరు అభ్యర్థిగా చల్లారామ చంద్రారెడ్డి పేరును ఖరారుచేస్తూ రెండురోజుల క్రిందట చంద్రబాబు సీనియర్లతో సమీక్షించారు. ఇంకా అన్నమయ్యజిల్లా, కడపజిల్లాలోనూ పలు నియోజకవర్గాల అభ్యర్థులను బాబు ఖరారుచేయడం, అక్కడ అభ్యర్థులు ధీటుగా పనిచేసుకుంటూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకుని ఎన్నికల్లో గెలిచే విధంగా పనిచేయాల్సి వుంది. చిత్తూరుజిల్లా, తిరుపతి జిల్లాలో ఇప్పుడిప్పుడే మిగిలిన నియోజకవర్గాలపై బాబు సమీక్ష నిర్వహించి అభ్యర్థులను ప్రకటించే సూచనలు లేకపోలేదు. ఇప్పటికే ఈ రెండు జిల్లాల్లో పార్టీ నేతల్లో సమన్వయం లోపించడం, పార్టీకోసం పనిచేసేవారు లేకపోవడం, అంతర్గతంగా అధికారపార్టీతో కలసిపోవడం వంటివి బాబుకు తలనొప్పి వ్యవహారంగా తయారయ్యారు. పార్టీ కోవర్టులుగా పనిచేస్తున్న వారిని పార్టీ నుంచి బయటకు పంపే యోచన చేస్తున్నా సాహసం చేయలేకపోతున్నారనేది కార్యకర్తల ఆవేదన. చిత్తూరు, పలమనేరు. కుప్పం, చంద్రగిరి, పూతలపట్టు, జిడినెల్లూరు, నగరి,సత్యవేడు, తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్ళూరు పేట, గూడూరు ప్రాంతాల్లో పార్టీకి ధీటుగా పనిచేసే నాయకులు ఎవరనేది బాబు నివేదికలు తెప్పించుకుంటున్నారు. పార్టీకి ప్రాణసమానులైన కార్యకర్తల నుంచి సమాచారం ,నాయకుల పనితీరుపై సమగ్రనివేదిక తీసుకుని ఆ తరు వాత గెలిచే వారికే టిక్కెట్ ఇవ్వాలనే నిర్ణయంతో చంద్రబాబు ఉన్నట్లు పలు వురు సీనియర్‌నేతలు స్పష్టం చేస్తున్నారు. ఈ సమయంలో పుంగ నూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే,మంత్రి పెద్దిరెడ్డిని ఓటుతో ధీటుగా ఎదుర్కొనే సత్తా చల్లారామచంద్రారెడ్డికి ఏమేరకు ఉందనేది తెలియాల్సి వుంది. పైగా పుంగనూరులో చల్లా కుటుంబం కూడా రాజకీయనేపథ్యం ఉంది. అంతేగాక గతంలో టిటిడి బోర్డు సభ్యుడుగా కూడా చల్లారామచంద్రారెడ్డి సేవలందించారు. ఇక్కడ మాజీమంత్రి అమరనాథరెడ్డి కుటుంబం తొలినుంచి టిడిపికి బలమైన మద్దతు ఉంది. ప్రజల నాడిని పట్టుకుని ఎన్నికలకు సమాయాత్తం కావడానికి ఎలాంటి వ్యూహరచన చేస్తారనేది వేచిచూడాల్సిందేనని పార్టీ విశ్లేషకులు చెబుతున్నారు.*

# జనసేన 'జనవాణి'కి సమస్యల వెల్లువ!

## -415 అర్జీలు స్వీకరించిన పవన్‌కళ్యాణ్
## -ప్రతి సమస్యకు పరిష్కారం : పిఏసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్



తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 21 ప్రభాతవార్త:

సామాన్యుడి గళాన్ని బలంగా వినిపించాలనే సదుద్దేశంతో పవన్‌కళ్యాణ్ 'జనవాణి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జనసేన పార్టీ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు.ఆదివారం స్థానిక 150 బైపాస్ రోడ్డులోని ఓ ప్రవేట్ ఫంక్షన్ హాల్ నందు ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి 4వ విడత 'జనవాణి' కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమం ప్రారంభానికి ముందు తనపల్లి క్రాస్ వద్దనున్న హోటల్ 'తాజ్' నుండి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తమ జనసైనికులు,అభిమానులతో కలిసి భారీ వాహన ర్యాలీగా సభాస్థలికి చేరుకున్నారు.అనంతరం జరిగిన అర్జీల స్వీకరణ కార్యక్రమం గురించి మనోహర్ మాట్లాడుతూ 'జనవాణి'లో 415 అర్జీలు వచ్చాయన్నారు.ఇందులో చిత్తూరు జిల్లా నుండి 280,అనంతపురం జిల్లా నుండి 79,నెల్లూరు జిల్లా నుండి 23,కడప జిల్లా నుండి 18,కర్నూలు జిల్లా నుండి 15 అర్జీలు వచ్చాయని ఆయన వివరించారు.ఈ అర్జీల పరిష్కార ప్రక్రియ సోమవారం నుండి మొదలవుతుందన్నారు.పవన్ దృష్టికి తీసుకెళితే సమస్య పరిష్కామవుతుందనే నమ్మకంతో చాలామంది చాలా దూరం నుండి వచ్చి అర్జీలు ఇవ్వడం జరిగిందన్నారు. రాయలసీమ ప్రాం తానికి మెడికల్ హబ్‌గా ఉన్న తిరుపతిలో వైద్యాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగమే కార్పొరేషన్ కార్యాలయాన్ని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి మార్చడమని దుయ్యబట్టారు. చిత్తూరు జిల్లాలో ప్రజాప్రతినిధుల కబ్జాలు,ఎర్రచందనం అక్రమ రవాణాపై ఫిర్యాదులు అందాయన్నారు.టిటిడి నిధుల దుర్వినియోగం, అలాగే దర్శన టికెట్లు అమ్ముకోవడంపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిని ఉద్యమ రూపంలో తీసుకెళ్లడానికి పవన్‌కళ్యాణ్ నిర్ణయం తీసుకుంటారన్నారు.ఈ యాత్రలో భాగంగా బలవన్మరణానికి పాల్పడిన ప్రతి రైతు కుటుంబానికి లక్ష రూ॥ల చొప్పున ఆర్థిక సాయమందించడం జరుగుతుందన్నారు.నిన్నటి రోజున కడప జిల్లాలో కూడా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు లక్ష చొప్పున ఇచ్చామన్నారు. సమావేశంలో నేతలు వరప్రసాద్,పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూధన్‌రెడ్డి, చిత్తూరు,నెల్లూరు, అనంతపురం జిల్లాల అధ్యక్షులు డా॥పసుపులేటి హరిప్రసాద్,చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి, టిసి.వరుణ్,తిరుపతి ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్,నేతలు రాజారెడ్డి,ఆకేపాటి సుభాషిణి,తదితరులు పాల్గొన్నారు.



# వెంకన్న సేవలో 'బ్రహ్మానందం'

తిరుమల,ఆగస్టు 21ప్రభాతవార్తప్రతినిధి:

సినీహాస్యనటుడు బ్రహ్మానందం ఆదివారం ఉదయం తిరుమలకు వచ్చారు. ఉదయం వెంకన్నను దర్శించుకున్నారు. ఆలయం వెలుపలకు వచ్చిన బ్రహ్మానందంను చూసేందుకు అభిమానులు, భక్తులు రావడంతో సందడిగా మారింది.



# నేటి నుంచి మళ్ళీ నేతి దీపాల అమ్మకాలకు గ్రీన్ సిగ్నల్?

## ఎంఎల్ఏ వద్ద పంచాయతీ!!
## శివయ్యకు దీపార్చన

శ్రీకాళహస్తి,ఆగస్టు 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసరాల్లో మళ్ళీ నేతి దీపాల వ్యాపారం ప్రారంభం కానుందా? అనేది చర్చనీయాంశంగా మారింది. సోమవారం సుమూహూర్తంగామళ్లీ నేతి దీపాల విక్రయాలు ప్రారంభానికి తమకు ప్రజా ప్రతినిధి నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని కాబట్టి ప్రారంభించుటకు లోలోపల సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇక్కడ నేతి దీపాల విక్రయాలు సుమారు ఏడాదిన్నర పాటు విచ్చల విడిగా సాగింది. కార్తీక మాసం అయితే ఇక్కడి వ్యాపారులు నేతి దీపాలని వచ్చిన భక్తులను నిలువు దోపిడి చేసారు. నేతి దీపాలని కల్తీ డాల్డ దీపాలను విక్రయిస్తూ భక్తులను మోసం చేయటం అలవాటైపోయింది. శ్రీకాళహస్తిపుణ్యక్షేత్రంలో దీపం వెలిగిస్తే మంచిదనేభక్తుల నమ్మకాన్ని ఇక్కడి వ్యాపారులు 'సొమ్ములు'చేసుకున్నారు.అయితే ఇక్కడ రెండున్నర నెల ముందు సిఐగా బాధ్యతలు స్వీకరించిన మహిళా అదికారి దేవస్థానం కట్టడి చేయలేని భక్తుల నిలువు దోపిడిని అరికట్టడంలో విజయం సాధించిదని భక్తులను నిలువుదోపిడి నుంచి రక్షించి పుణ్యక్షేత్రానికి మంచిపేరు వస్తుందని ప్రసంశలందుకుంటున్న తరుణంలో మళ్ళీ నేతి దీపాల విక్రయాలకు అనుమతి వచ్చిందనే అంశం చర్చనీయాంశంగామారింది.

**నాయకుని వద్ద పంచాయతీ!!**

శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద నాలుగు గోపురాల వద్ద వ్యాపారాలు చేసే వారు ప్రధానంగా 'నేత దీపాల విక్రయాలకు పూనుకున్నారు.' నెయ్యి అని డాల్డ దీపాలతో పాటు పత్రి,రెండు పువ్వులు ఇచ్చి వందలకు వందలు గుంజే వారు. అయితే భక్తులు లబోదిబో అంటున్నా పట్టించుకునే దిక్కులేదు. మార్చిలో ధర్మకర్తల మండలిగా బాధ్యతలు స్వీకరించిన ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఓ వైపు, కొత్తగా బాధ్యతలు చేపట్టిన సిఐ అంజూ యాదవ్ ఎవరి పరిధిలో వారు కల్తీ నేతి దీపాల అమ్మకాలపై దృష్టి సారించారు. కట్టడి చేసారు. దాంతో వ్యాపారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలో కొందరు వ్యాపారులు శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డికి తమ గోడు వినిపించుకున్నారు. ఆయన పార్టీ కార్యాలయం వద్దకు రమ్మని వారి ఇబ్బందులు వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని విచారించారు. అయితే భక్తులను మోసం చేస్తే మిమ్ములను ప్రోత్సహిస్తే ఆ పాపంలో తనకూ భాగం ఉంటుందని వ్యాపారాలు చేసుకోవటం కుటుంబాలను పోషించుకోవటం తప్పు కాదు. కానీ పాపపు సొమ్ముతో కాకుండా న్యాయసమ్మతమైన సంపాదనతో వ్యాపారాలు చేసుకోమని సూచించినట్లు సమాచారం.

# తిరుపతి డివిజన్

## రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోంది

### పరామర్శలకు కూడా అనుమతి ఎందుకు ఇవ్వరు -బొజ్జలసుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త

రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందని కనీసం పరామర్శలకు కూడా వైసిపి ప్రభుత్వం అనుమతివ్వకపోవడం సిగ్గుచేటని నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ పాత్రికేయులు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా కొత్త రోడ్డు జంక్షన్‌లో నారాలోకేష్‌ను అరెస్టుచేసిన నేపథ్యంలో ప్రభుత్వ ఆరాచకాలకు బలైన వారి పరామర్శలకు వైకాపా ప్రభుత్వం ఎందుకు అనుమతించట్లేదు? ఉత్తరాంధ్ర ప్రజలపై ప్రభుత్వం కక్ష్య సాధింపుని కొనసాగిస్తోందని రాజారెడ్డి రాజ్యాంగంలో



బాధితులకి అండగా నిలబడడానికి నీ పోలీసులు అనుమతులు కావాలా జగన్‌రెడ్డి అని ప్రశ్నించారు. వైకాపా సిఎం జగన్ రెడ్డి ముందు ఉన్న ముఖ్యమంత్రులు ప్రజాస్వామ్యస్ఫూరినతని మరచిచ మిమ్మల్ని అడ్డగించి ఉంటే మీరు ఓదార్పుయాత్రలు, పాదయాత్రలు చేయగలిగేవారా అని సూటిగా ప్రశ్నించి దుయ్యబట్టారు. శ్రీకాళహస్తిలో కూడా ఓ మాఫియా తయారైందని గతంలో దివంగత నేత తన తండ్రి బొజ్జలగోపాలకృష్ణారెడ్డి చేసిన అభివృద్ధి తప్ప ఒక్క అభివృద్ధి కూడా జరగలేదన్నారు. వైకాపా ప్రభుత్వంలో మీడియా గొంతును కూడా నొక్కేసారన్నారు. మూడేళ్ళ పాలనలో జరిగిన అభివృద్ధిపై ఎంఎల్‌ఏ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అధికారపార్టీకి తలొగ్గి ఇలాంటి చర్యలకి పాల్పడే పోలీసులు కూడా జగన్‌రెడ్డికి, వైసిపికి మాత్రమే జీవితకాల అధ్యక్షుడు అని ఈ రాష్ట్రానికిశాశ్వతముఖ్యమంత్రికాదని గుర్తు పెట్టుకోవాలని అధికారులకు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, రెడ్డివారిగురవారెడ్డి, పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 21 ప్రభాతవార్త



మండలంలోని చల్లపాలెం గ్రామంలో ఎంజిఎం ఆస్పత్రి సారథ్యంలో మరియు హిందూస్తాన్ కోకకోలా బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. చల్లపాలెం గ్రామం, మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సుమారు 150మంది పాల్గొని వారి ఆరోగ్యానికి సంబందించిన సలహాలు సూచనలు తీసుకున్నారు. వైద్యశిబిరంలో ప్రతి ఒక్కరికి ఉచితంగా రక్తపరీక్షలు, బిపి పరీక్షలు చేయించుకుని అనంతరం వైద్యుల సలహా మేరకు మందులు తీసుకున్నారు. వైద్యశిబిరంలో ఎంజిఎం ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వివేక్ చైతన్య, డాక్టర్ గీతారాణి, డాక్టర్ అభిషేక్‌లు పాల్గొన్నారు. ఎంజిఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరుమయూర్ మాట్లాడుతూ గతంలో పలు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తూ ఇప్పుడు కోకా కోలా కంపెనీ వారి కోరిక మేరకు చల్లపాలెంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేశామని వీటిని ప్రజలందరు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహా భారత ఉత్సవాలలో ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతిరూరల్, ఆగస్టు21 ప్రభాతవార్త:



హిందువులకు పంచమ వేదంగా పరిగణించబడే భారత ఇతిహాసం, మహా భారతం అని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మహా భారతాన్ని చదివినా....నాటక ప్రదర్శనలు తిలకించిన జ్ఞానం పెరుగుతుందని తెలిపారు. తిరుపతిరూరల్ మండలం పాతకాల్వ పంచాయతీలోని ధర్మరాజుల గుడి ఆవరణలో వేడుకగా నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. అగ్నిగుండం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 18 పర్వాల మహాభారతాన్ని 18 రోజుల పాటు ఉదయం హరికథ, రాత్రి వీధి నాటకాల ద్వారా ప్రదర్శనతో సంప్రదాయాల పరిరక్షణకు చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం హరిదాసుని సత్కరించి, నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

## అలరించిన అమృత నృత్యం

తిరుపతి,ఆగస్టు 21ప్రభాతవార్త:



తెలుగువారి నృత్యం కూచిపూడిలోని వివిధ సంప్రదాయాలలో పలు కీర్తనలకు కుమారి తుంగా అమృత చేసిన నృత్యసంగీతం అభిమానులను ఎంతగానో అలరించింది. ఆదివారం రాత్రి మహతి ఆడిటోరియంలో జరిగిన కుమారి తుంగా అమృత కూచిపూడి రంగప్రవేశం కార్యక్రమం గణేశస్తోత్రంతో మొదలైంది. పుష్పాంజలి, ప్రణవకం, నటేషకౌత్వం, దరువు రుక్మిణీ ప్రవేశం ,నీలమేఘ తరంగం, శ్రీకృష్ణ శబ్దం అన్నమయ్యకృతి జావళి...తిల్లానాతో ముగిసింది. ఆద్యంతం కూచిపూడి రంగప్రవేశం అమృత అభినయం సభికులను విశేషంగాఆకట్టుకుంది. పులకించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా పసుమర్తి రత్తయ్యశర్మ, డాక్టర్ అలేఖ్య పుంజాలి, కొరియోగ్రాఫర్ తరుణ్ మాస్టర్‌లతోబాటు ప్రముఖులు హాజరయ్యారు.

## ఆ ఒక్కటే నత్తనడక

– పునాదులకే పరిమితమైన కృష్ణజిమ్మాపురం రైతు భరోసా భవన నిర్మాణం

పాలసముద్రం, ఆగస్టు 21 ప్రభాతవార్త:



పాలసముద్రం మండల పరిధిలో మొత్తం 9 రైతు భరోసా కేంద్రాలు మంజూరు అయితే అందులో ఒక్క కృష్ణజిమ్మాపురం గ్రామ సచివాల యం పరిధిలో మంజూరైన రైతు భరోసా కేంద్రం పనులు మాత్రం నత్తనడకగా నడుస్తున్నాయి. మండలంలో మంజూరైన మిగిలిన రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావస్తుండగా కృష్ణజిమ్మాపుం రైతు భరోసా కేంద్ర నిర్మాణం మాత్రం బాలరిష్టాలు దాటి ముందడుగు వేయని పరిస్థితి నెలకొంది. రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలకు నిధులు పుష్కలంగా విడుదల అవుతున్నప్పటికీ ఇక్కడ మాత్రం అధికార పార్టీ నాయకులు నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి ముందుకు రావడం లేదు. పాలసముద్రం మండలానికి ఎంపిపిగా ప్రాతినిధ్యం వహిస్తున్న సెగ్మెంట్‌లోనే కృష్ణజిమ్మాపురం సచివాలయం వుంది. ఎంపిపి ప్రాతినిధ్యం వహిస్తున్న సెగ్మెంట్‌లో జరిగే అభివృద్ధి పనులు ఇతర సెగ్మెంట్‌లకు ఆదర్శవంతంగా వుండాల్సి వుండగా పాలసముద్రం మండలంలో అందుకు విరుద్దంగా నడుస్తోంది. అధికారులు సైతం ఇక్కడ రైతు భరోసా కేంద్ర నిర్మాణ పనులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడి రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులను వేగవంతం చేస్తారని ఆశిద్దాం.

## గుండాలకోనలో శ్రీ విద్యానికేతన్ విద్యార్థి మృతి

ఈత కోసం వెళ్ళి మృత్యువాత పడిన విద్యార్థి

చంద్రగిరి, ఆగస్టు 21 ప్రభాతవార్త:



మండల పరిధిలోని రంగంపేట వద్ద గల శ్రీ విద్యానికేతన్‌లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న వి.నవీన్ (18) గుండాలకోన వాలువలో మునిగి మృతి చెందాడు. వైఎస్ఆర్ కడప జిల్లా, కొండూరుకు చెందిన నవీన్ శ్రీవిద్యానికేతన్‌లో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో సహచర విద్యార్థులతో కలసి శ్రీవిద్యానికేతన్ సమీప అటవీ ప్రాంతంలోని రాగిమాను గుంట వద్ద గల గుండాలకోన కాలువలో ఈతకు వెళ్ళినట్లు తెలిసింది. అయితే నవీన్‌కు ఈత రాకపోవడంతో కాలులో కొంత దూరం వెళ్ళి మునిగిపోయి మృతి చెందినట్లు సమాచారం. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్ళ సహాయంతో మృతదేహాన్ని వెళికితీశారు. మరింత సమాచారం పోలీసు విచారణలో తెలియాల్సి వుంది.

## ఎంపేడు వద్ద రోడ్డు ప్రమాదం : ఒకరు మృతి

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 21 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ఎంపేడు వద్ద ఆదివారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందింది. ఓ వివాహ కార్యక్రమానికి హాజరై స్వగ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. శ్రీకాళహస్తి రూరల్ ఎస్ఐ వెంకటేష్ అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్యజిల్లా గుర్రం కొండ మండలం ఎల్లట్ల గ్రామానికి చెందిన రమేష్ (36), వెంకటగిరిలో ఓ వివాహ కార్యక్రమాలకు హాజరై తిరిగి కారులో వస్తుండగా ఎంంపేడు సమీపంలో ఆగిఉన్న ట్రాక్టర్‌ను వెనుక భాగంలో ఢీకొంది. కారును ఆతనే డ్రైవ్ చేస్తున్నారు. నిద్ర మత్తులో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను గుర్తించకపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో రమేష్ అక్కడి కక్కడే మృతి చెందినట్లు సమాచారం. మృతి చెందిన రమేష్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఎస్ఐ వివరించారు. మృతదేహాన్ని వైద్య పరీక్ష నిమత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు టాక్టర్‌కు వెనుక రేడియం స్టిక్కర్ ఉండాలి. కానీ లేదని దాంతో ట్రాక్టర్ డ్రైవర్ తొట్టంబేడు మండలం రౌతుసూరమాలకు చెందిన రాఘవులును అదుపులో తీసుకున్నట్లు వివరించారు.

## మృతి చెందిన కుటుంబానికి పరామర్శ

శ్రీకాళహస్తి రూరల్, ఆగస్టు 21 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి తిరుపతి రహదారిలోని లాంకో సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏర్పేడు మండలం ఆమందూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త ప్రసాద్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ఆదుకొనుటకు భరోసా ఇచ్చారు. ఆయనతోపాటు మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు,సర్పంచ్ గుణశేఖర్ యాదవ్ తదితరులున్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.2లక్షల విరాళం

శ్రీకాళహస్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి విరాళంగా హైదరాబాదుకు చెందిన ఆర్.లక్ష్మినారాయణ రూ.2లక్షలు విరాళాన్ని ఆలయ ధర్మకర్త మండలి అధ్యక్షులు అంజూరుతారకశ్రీనివాసులుకు అందించారు. ఈసందర్భంగా దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనం చేయించడంతో పాటు స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఎఈవో ఎన్ఆర్.కృష్ణారెడ్డి, పాలమండలి ప్రత్యేక ఆహ్వానితులు పవన్‌కుమార్, మరియు సెన్నీరుకుప్పంశేఖర్, కంఠాఉదయ్‌కుమార్, బాల, ముని తదితరులు పాల్గొన్నారు.

## బోనుపల్లి గ్రామంలో తెదేపా ఇన్‌ఛార్జి సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, ఆగస్టు 21 ప్రభాతవార్త



బోనుపల్లి గ్రామానికి చెందిన సుబ్రమణ్యం సుజాత దంపతుల కుమారుడు మహేష్‌పుష్పల వివాహం జరిగింది. నూతన దంపతులను అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులునాయుడు , మునిలక్ష్మి దంపతుల కుమారుడు మనోహర్, కృష్ణవేణిలకు వివాహ కార్యక్రమానికి హాజరై రెండు కుటుంబాల నూతన దంపతులను సుఖసంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు. అనంతరం గాలిమాధవనాయుడు ఆరోగ్య పరిస్థితి బాగోలేదని తెలుసుకున్న ఆయన ఇంటికి వెళ్ళి ఆయన్ను పరామర్శించారు. అనంతరం మాజీ సర్పంచ్ దావులూరు రామానాయుడు ఇంట్లో తేనీటి విందుకు హాజరయ్యారు. కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు,మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ చెంచయ్యనాయుడు,బాలాజీ,పోలూరుశ్రీనివాసులురెడ్డి,దుర్గాప్రసాద్, రమేష్, రాజేంద్ర, రామానాయుడు, గిరి, ఉమాపతి, బత్తెయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

## నూతన దంపతులకు బొల్లినేని ఆశీర్వచనాలు

తొట్టంబేడు, ఆగస్టు 21 ప్రభాతవార్త



బోనుపల్లి గ్రామంలో జరిగిన వివాహ వేడుకలను హజరై నూతన వధూవరులను మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాధంనాయుడు దంపతులు ఆశీర్వదించారు. మండలంలోని బోనుపల్లి గ్రామానికి చెందిన మందలశ్రీనివాసులునాయుడు మునిలక్ష్మిల కుమారుడు మునిశేఖర్ వివాహ కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి జ్ఞాపికలను అందించారు. ఈసందర్భంగా జగన్నాధంనాయుడు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## లోకేష్ పర్యటన అంటే జగన్‌రెడ్డికి ఎందుకు ఉలికిపాటు?

–చక్రాల.ఉష

.శ్రీకాళహస్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త



లోకేష్ పర్యటన అంటే జగన్‌రెడ్డికి ఎందుకు ఉలికిపాటని తిరుపతి పార్లమెంటు తెలుగుదేశంపార్టీ అధ్యక్షురాలు చక్రాల.ఉష అన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా కొత్త రోడ్డు జంక్షన్‌లో నారాలోకేష్‌ను అరెస్టుచేసిన నేపధ్యంలో ఆమె స్పందించారు. సభలు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి రాజ్యాంగం హక్కు కల్పించిందని పరామర్శలు, విచారింపులు, రాష్ట్రంలో తిరిగే హక్కు ఎవరికైనా ఉందని జగన్‌రెడ్డి పోలీస్‌యంత్రాంగం మీచేతుల్లో ఉందని ఇష్టానుసారంగా నచ్చినట్లు తెలుగుదేశంనాయకులంతా బతకాలని చెబితే వినడానికి మీ అబ్బ జాగీర్ ఏమీ కాదంటూ ఘాటుగా విమర్శచేశారు. నారాలోకేష్ అప్రజాస్వామికం పరామర్శకు వెళ్ళిన వారిని అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. నారాలోకేష్‌ను అరెస్టు చేయడం జగన్‌రెడ్డి పిరికితనానికి, భయానికి నిదర్శనం అన్నారు. ఒకప్పుడు నారాలోకేష్‌ను విమర్శించిన జగన్ ఇప్పుడు లోకేష్ బయటకు వస్తున్నారంటేనే తాడేపల్లిలో జగన్‌కు చలిజ్వరం వస్తోందని దుయ్యబట్టారు. ఇందుకు వైకాపా ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు.

## రాస్ అనేది రాజగోపాల నాయుడు కలల పంట

– రాష్ట్ర మాజీ మంత్రి గల్లా అరుణకుమారి స్పష్టీకరణ

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 21 ప్రభాతవార్త :

రాస్ అనేది రాజగోపాల నాయుడు కలల పంట అని రాష్ట్ర మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. మునిరత్నం అంటే నాకు చాలా గౌరవం ఉందని, వారు తప్పకుండా రాస్‌కు ఎనలేని సేవలందించారరని అందులో సందేహం లేదన్నారు. కానీ రాయలసీమ సేవా సమితి వ్యవస్థాపకులు, ఫౌండర్ అది ముమ్మాటికీ రాజగోపాల నాయుడేనని తెలిపారు. పార్లమెంటరీ అయిన తర్వాత ప్రజలకు దగ్గరగా ఉండి సేవలందించలేక పోతున్నానన్న కారణంతో 1981, జనవరి 23న రాయలసీమ సేవా సమితి అని పేరు పెట్టి ఒక కమిటి వేశారు. అందులో అధ్యక్షులుగా రాజగోపాల్‌నాయుడు, ఉపాధ్యక్షులు కడప పార్లమెంట్ సభ్యులు కందుల ఓబులరెడ్డి, అలాగే మునిరత్నం ప్రధాన కార్యదర్శిగా నియమించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. తర్వాత ఈ రాస్‌కు నిధులు సాధించడంలోను, ప్రాజెక్టులను తయారు చేయడంలోనూ మొత్తం కృషి రాజగోపాల్‌నాయుడుదేనన్నారు. మునిరత్నం నాయుడు కేవలం కార్య నిర్వాహకులు మాత్రమే ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలని, రాజగోపాల్ నాయుడు రాస్ అభివృద్ధికి చేసిన కృషిని భావితరాలకు గుర్తు చేయాలన్న ఉద్దేశ్యంతో చెప్పడం జరిగిందని ఆమె పేర్కొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ సీతాలమ్మ అమ్మవారికి పొంగళ్లు, పూజలు

కేవీబీ పురం, ఆగస్టు 21 ప్రభాతవార్త:



మండలంలోని ఆరె గ్రామ పంచాయతీలో వెలసిన బంగారమ్మ దేవాలయంలో మండల ఆటోల యూని యన్, ఆటో యజమానులు అందరూ కలసి అమ్మవారికి పొంగళ్లు పెట్టి జంతు బలులు ఇచ్చి పూజలు చేశారు. మండలంలోని 65 మంది ఆటో వాళ్ళ అభిమానులు కలసి ప్రతి సంవత్సరం కృపా కటాక్షాలకు అందిస్తామని ఆటో యజమానులు తెలిపారు. వారి కృపా కటాక్షం వల్ల మేమందరం మా కుటుంబాలు శాంతియుతంగా బంగారు తల్లి మా కుటుంబాలకు రక్షణ అని ఆటో యూనియన్ నాయకులు వెంకటేష్, సురేష్‌లు మొక్కుకున్నారు. అలాగే 500 మందికి అన్నదానం చేశారు.

## నారా లోకేష్ అరెస్టు అప్రజాస్వామికం

వడమాలపేట, ఆగస్టు 21 ప్రభాతవార్త:

శ్రీకాకుళం జిల్లాలో నారా లోకేష్‌ను పోలీసులు అరెస్టు అప్రజాస్వామికమని చిత్తూరు పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి యాళ్ళ లక్ష్మీప్రసన్న ఖండించారు. ముఖ్యమంత్రి వారి కేబినెట్ ముఠా సభ్యుడి అరాచకంతో అవస్థలకు గురైన వారిని పరామర్శించేందుకు వెళుతున్న నారా లోకేష్‌ను పోలీసులు నడి రోడ్డుపై అడ్డగించి అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. ప్రజలకు ప్రజాస్వామ్య బద్ధంగా దక్కిన హక్కులను జగన్మోహన్‌రెడ్డి హరిస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నాడని విమర్శించారు. నారా లోకేష్‌ను అరెస్టు చేయడం జగన్మోహన్‌రెడ్డి పిరికి తనానికి, భయానికి నిదర్శనం. దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆమె అన్నారు.

## నారా లోకేష్ అరెస్ట్ అప్రజాస్వామికం

ధనంజయులుయాదవ్



విజయపురం, ఆగస్టు 21 ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఆదివారం శ్రీకాకుళం జిల్లాలో పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి చుక్కా ధనంజయులు యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. శ్రీకాకుళంలోని పలాసలో బాధిత టిడిపి కుటుంబాలను పరామర్శించడానికి వెళుతున్న లోకేష్‌తో పాటు పలువురు టిడిపి రాష్ట్ర నాయకులను పోలీసులు అడ్డుకోవడం, అరెస్టులు చేయడం ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి, రాష్ట్ర పోలీసులకు సిగ్గు చేటని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలని పరామర్శించడానికి వెళుతుంటే వైసిపి ప్రభుత్వానికి భయమెందుకు ప్రశ్నించారు. అలాగే వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రస్తావించడాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్షాలను ప్రజల్లోకి వెళ్లనీయకుండా పోలీసులతో అడ్డుకుంటున్నారని విమర్శించారు.

## చెరకు రైతులకు బకాయిలు చెల్లించలేదని పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు

విజయపురం, ఆగస్టు 21 ప్రభాతవార్త :

నింద్ర నేతం చెరకు కర్మాగారంలో రెండేళ్ల క్రితం చెరకు సరఫరా చేసుకుని రైతులకు బకాయిలు చెల్లించలేదని, చెరకు రైతులను ఆదుకోవాలని జిల్లా జనసేన కార్యదర్శి స్వామినాథన్ తెలిపారు. తిరుపతిలో జనవాణి కార్యక్రమంలో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నాటకాలు చేస్తూ రైతులను మోసం చేస్తోందని, రైతుల పక్షాన పోరాడాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విజయపురం, ఆగస్టు 21 ప్రభాతవార్త :

మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ పివి హైస్కూలు ఆవరణలో ఆదివారం శ్రీ వేంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి తిరుపతి, కెకెసి హోమియో కాలేజీ పుత్తూరు సహకారంతో తిరుపతి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి పరీక్షలకు 150 మంది చేసుకున్నారని, వీరిలో ఆపరేషన్ కోసం 46 మందిని ఎంపిక చేశామని రోటరీ క్లబ్ చైర్మన్ డాక్టర్ కె.వి.చలపతి తెలిపారు. హోమియోపతి వైద్యానికి 52 మంది హాజరయ్యారని తెలిపారు. కోరా షూ మార్ట్ యజమానిక డాక్టర్ విజయ కంటి అపరేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరికీ కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు టెంకాయల దామోదరం, రామకృష్ణమనాయుడు, నారాయణస్వామినాయుడు, రాజేష్‌కుమార్, దత్తు, దామోదరగుప్త, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ మృతి

శ్రీకాళహస్తి,ఆగస్టు 21 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తూ ఇటీవల దేవాదాయశాఖ మూకుమ్మడి బదిలిల్లో శ్రీశైలంకు బదిలి అయిన ఎం.శ్రీధర్ ఆదివారం తుది శ్వాస విడిచారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న శ్రీధర్ శ్రీకాళహస్తీశ్వరాలయంలో వివిధ శాఖల్లో విధులు నిర్వహించారు. అన్నదానం, శానిటేషన్‌లలో సమర్థవంతంగా పని చేసారు. తనకు అప్పగించిన బాధ్యతలను జవాబుదారి తనంతో నిర్వహించారు. పట్టణంలోని పానగల్‌లో నివాసముంటున్న శ్రీధర్ మృతికి పలువురు సంతాపాలు తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఉద్యోగుల సంఘ నాయకులు తమ సంతాపాలను తెలిపారు. దేవస్తానం చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రగాఢ సంతాపం తెలిపారు. బిజెపి పార్లమెంటు నాయకుడు బి.చంద్రప్ప, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరసింహామూర్తి తదితరులు తమ సంతాపాల్ని తెలిపారు.

## శ్రీకాళహస్తిలో డ్రగ్స్‌లైసెన్స్ కార్యాలయం ప్రారంభం

శ్రీకాళహస్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త



ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి ఒక్క మందుల దుకాణదారుడు ఉండాలని జిల్లా అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ అధికారి కళ్యాణచక్రవర్తి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏపిసీడ్స్ వద్ద ఔషద తనిఖీ అధికార కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ రూతు, జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్స్ అసోసియేషన్ అధ్యక్షులు పివి.రత్నం, కార్యదర్శి నరేష్‌బాబు, ట్రెజరర్ టి.నరసింహులు హజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ అధికారి కళ్యాణచక్రర్తి మాట్లాడుతూ శివయ్య సన్నిధిలో డ్రగ్ లైసెన్స్ కార్యాలయం రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అలాగే జిల్లా విభజన తర్వాత గూడూరులో ఉన్న కార్యాలయంలో శ్రీకాళహస్తికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లాకు సంబందించిన జోనల్ పరిధిలో ఉన్న మండలంలో జరిగే పనులను ఇక్కడి కార్యాలయం నుంచే చేయించుకోవచ్చున్నారు. అలాగే అన్ని మెడికల్ దుకాణాల యజమానులు ప్రభుత్వం సూచించిన సూచనలను పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే సేవా కార్యక్రమాలను కూడా చేపట్టాలని సూచించారు. అనంతరం జిల్లా అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ అధికారి కళ్యాణచక్రవర్తిని దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో పట్టణ కెమిస్ట్ అండ్ డ్రగ్స్ అసోసియేషన్ అధ్యక్షులు నంద(నరసింహులు), కార్యదర్శి మునిరెడ్డి, ట్రెజరర్ చిన్నారావు, మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో పెరుగుతున్న భక్తులు

శ్రీకాళహస్తి,ఆగస్టు 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తుల సంఖ్య స్వల్పంగా పెరిగింది. ఆదివారం ఉదయం నుంచి భకక్తుల తాకిడి పెరిగింది. అంతేకాక రాహుకేతుదోష నివారణ పూజలుకూడా పెరిగాయి. ఆలయాధికారులు అందించిన సమాచారంమేరకు ఆదివారం సాయంత్రానికి 21వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు సుదర్శనం కల్పించుటకు ఆలయ ఇఒ వికె సాగర్‌బాబు పర్యవేక్షించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులకుఎలాంటి ఇబ్బంది కల్గకుండా చర్యలు తీసుకున్నారు. ఆయన ఉదయం నుంచి రాహుకేతుదోష నివారణ పూజల మండపాల్లో తరచూ ఆకస్మిక తనిఖీ లు చేస్తూ పూజారులు భక్తుల్ని ఇబ్బంది పెడుతున్నారా? కాసులు వసూలు చేస్తున్నారా? అని పరిశీలించారు. ఆలయం వద్ద కట్టడి చేయటంతో దళారులు కూడా టిక్కెట్లు కొనుగోలు చేసి దర్శనాలకు




తీసుకెళ్ళారు. ఎవ్వరిని టిక్కెట్లు లేకుండా అనుమతించవద్దని గేట్ల వద్ద ఉత్తర్వులు జారి చేసారు. దర్శనం టిక్కెట్లుకు సంబంధించి రూ.200 ప్రత్యేక దర్శనం టిక్కెట్లు 669 రూ.50ల ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు 2090 రాహుకేతుదోష నివారణ పూజల్లో రూ.,500ల టిక్కెట్లుద్వారా 2203 రూ.750టిక్కెట్లు ద్వారా 783, రూ.,1500 టిక్కెట్లు ద్వారా 168, రూ.2500 టిక్కెట్లు ద్వారా 190, రూ.5వవేల టిక్కెట్లు ద్వారా 56 పూజలు జరిపించుకున్నారు. కాగా అభిషేకాలను పరిశీలిస్తే 62 అభిషేకాలను అనుమతించారు. అలాగే మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 13 శనీశ్వరాభిషేకాలు 10జరిగినట్లు సమాచారం. అందించారు. ఇక విఐపిలు కూడా గణనీయంగా ఉంది. గోపూజలు 207 జరిగినట్లు దేవస్థానం జారి చేసిన ప్రకటనల్లో పేర్కొన్నారు.

**జనమే జనం . . .**

శ్రీకాళహస్తి పట్టణం ఆదివారం జనం సందడితో కిట కిటలాడింది. ఓ వైపు వారాంతపు సెలవుల జనం ఆలయానికి రాగా మరో వైపు పెళ్ళిళ్ళసీజన్‌లో ఈ ఏడాదికి చివరి మూహూర్తాలు కావటతో జనం విపరీతంగా కనబడ్డారు. ఎటు చూసినా జనం జనం అన్నట్లు మారింది. పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం కల్గింది.

# కమనీయం వరసిద్ధుని కళ్యాణం



కాణిపాకం, ఆగస్టు 21 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఆదివారం జరిగిన ప్రధాన ఆలయ చతుర్వేద హవన సహిత మహాకుంభాభిషేకం సందర్భంగా రాత్రి స్వామివారికి తిరుకళ్యాణం కమనీయంగా అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదిక వద్ద తిరుకళ్యాణంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు కళ్యాణ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసి, దేధీప్యమానంగా అలంకరించిన కళ్యాణ వేదికపై సిద్ధి, బుద్ధి, సమేత గణనాధుని ఉత్సవమూర్తులను వుంచి ఆలయ ప్రధాన అర్చకులు ధర్మేశ్వర్‌గురుకుల్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే నూతన వధూవరులైన సిద్ధి, బుద్ధి గణనాధులకు పుణ్యాహావాచనం, కంకణదారణ, యజ్ఞోపవీతం గావించి స్వామివారికి పాదపూజ చేశారు. అనంతరం స్వామివారిచే ఉభయదేవేరులకు మాంగల్యదారణ చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లు తలంబ్రాలు పోసుకునే కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ దాతలు గాయత్రీదేవి, ఐకా రవి, జానకి, గుత్తికొండ శ్రీనివాస్, పద్మజ, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ దంపతులు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు, ఈఈ వెంకట నారాయణ, కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఏసీ కస్తూరి, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డిలతో పాటు వేదపండితులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. అలగే రాత్రి స్వామివారికి గ్రామోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక పల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు.

# సిలెండర్ల పరిశ్రమతో వేయిమందికి ఉపాధి

-ఎంపి మిధున్‌రెడ్డి



సిలెండర్ల పరిశ్రమ ఏర్పాటునకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపి మిధున్‌రెడ్డి

పుంగనూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త :

నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకురావాలనే మంత్రి పెద్దిరెడ్డి సంకల్పానికి నిదర్శనమే పుంగనూరులో సిలెండర్ల పరిశ్రమ మంజూరని రాజంపేట ఎంపి మిధున్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఆరడిగుంట సమీపంలోని 12 ఎకరాల స్థలంలో గాయత్రి సిలెండర్ల పరిశ్రమకు శంకుస్థాపన, శిలాఫలకావిష్కరణ కార యక్రమాలలో పాల్గొన్నారు.వెయి మంది వరకు నిరుద్యోగులకు ఉపాధికల్పించే ఈపరిశ్రమ ఏర్పాటుకు అడిగిన వెంటనే అన్ని విధాలా ఆదేశాలు జారీచేసిన ముఖ్యమంత్రికి ఆయన వందనాలు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏడున్నర దశాబ్దాలకుపైగా ఎటువంటి ప్రగతిలేని ఈనియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనే మంత్రి పెద్దిరెడ్డి ధ్యేయంగా ఉన్నారన్నారు. పరిశ్రమయజమాని జబ్బాల శ్రీనివాసులు మాట్లాడుతూ ఈపరిశ్రమకు సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి,ఎంపిలు మిధున్‌రెడ్డి, రెడె ప్పలకు ధన్యవాదాలు తెలిపారు. స్థానికులకే ఈపరిశ్రమలో ప్రోత్సాహమిచ్చి ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రజానపదకళల అకాడమీ ఛైర్మన్ కొండవీటి,పిఎంకే ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డియాదవ్,ఎంపిపి భాస్కరరెడ్డి,ఆర్టీసి మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి,ఏఎంసి ఛైర్మన్ నాగరాజరెడ్డి,పరిశ్రమ డైరెక్టర్ జబ్బలసాయి, జబ్బల కుటుంబీకులు,వైకాపా నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి సీఎం జగన్ కృషి: డిప్యూటీ సీఎం

కాణిపాకం, ఆగస్టు 21 ప్రభాతవార్త:

రాష్ట్రంలో దేవాలయాలు, హిందూమతం అభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఆదివారం కాణిపాకంలో జరిగిన కుంభాభిషేకంలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో దేవాలయాలను అభివృద్ధి చేయాలనే ఆశయంతో వున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో ప్రతిపేదవాడు అభివృద్ధి చేందాలని, ప్రతి ఇంట్లో సంతోషం వుండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

కాణిపాకం ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ కృషి: పెద్దిరెడ్డి

ఎంతో చరిత్ర కలిగిన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర అటవీ పర్యావరణ, విద్యుత్ శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. అతి తక్కువ వ్యవధిలో ఆలయ పునర్నిర్మాణాన్ని పూర్తి చేసి భక్తులకుస్వామివారి దరర్శనం ఏర్పాటు చేయడం సంతోకరమని, దేవాలయాన్ని పునర్నిర్మించిన దాతలను ఆయన అభినందించారు.

ఆద్యాత్మిక కేంద్రంగా కాణిపాకం అభివృద్ధి: మంత్రి రోజా

కాణిపాకం ఆలయాన్ని ప్రముఖ ఆద్యాత్మిక కేంద్రంగా తీర్చి దిద్దుతామని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె,రోజా అన్నారు. కాణిపాకం ఆలయంలో స్వామివారి దర్శనం మాటల్లో చెప్పలేని అనుభూతి అని దేవాలయాల్లో అందరికి పాజిటివ్ ఎనర్జ్ అందుతుందని తెలిపారు. కాణిపాకం ఆలయ అభివృద్ధి దృష్ట్యా ప్రసాదం స్కీంను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

విఘ్నేశ్వరుని అనుగ్రహంతోనే కార్యాలు ప్రారంభం: శక్తి నారాయణి అమ్మన్

ఏపూజ కాని, ఏ కార్యక్రమం కాని విఘ్నేశ్వరుని అనుగ్రహంతోనే ప్రారంభిస్తామని ఎంత మంది దేవతలున్నా ఆయనే మొదటి పూజ అందుకుంటాడని అందుకే గణనాధుడు అంటారని తమిళనాడు వేలూరు శ్రీపురం స్వర్ణ దేవాలయం వ్యవస్థాపకులు శక్తి నారాయణి అమ్మన్ అన్నారు. కాణిపాకం ఆలయంలో కుంభాభిషేకం అత్యంత వైభవంగా జరిగిందన్నారు.



టీటీడీ ఈఓ ధర్మారెడ్డి దంపతులకు మెమెంటోను అందజేస్తున్న ఎమ్మెల్యే, ఈఓలు

# పురవీధుల్లో గెరిగె ఊరేగింపు



పుత్తూరురూరల్, ఆగస్టు 21 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని బజారువీధిలో వెలసిన గ్రామదేవత గంగమ్మజాతర సందర్భంగా ఆదివారం ఉదయం జరిగే ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పుష్పాలతో పూజించారు. అనంతరం స్థానిక శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజులస్వామి ఆలయ ప్రాంగణం నుంచి డప్పు వాయిద్యాల నడుమ గెరిగెను పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. 24వ తేదీ గ్రామదేవత గంగజాతర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గంగజాతర కమిటీ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం పట్టణంలోని పలు వీధుల్లో అమ్మవారి ప్లెక్సీ బోర్డులను ఏర్పాటుచేస్తున్నారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

-ప్రతి ఊరులో రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటి పెంచాలి

-తుడా పరిధిలో 1.25 లక్షల మొక్కలు పంపిణికి శ్రీకారం

-మొక్కలు నాటే, పరిరక్షించే బాధ్యత ప్రభుత్వ సిబ్బందిదే

-తుడా చైర్మెన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి





తిరుపతిరూరల్, ఆగస్టు21 ప్రభాతవార్త:

పర్యావరణాన్ని పరిరక్షించడం....పచ్చదనాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని తుడా చైర్మెన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. దేశ రాజధాని డిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ..పచ్చదనం పెంపొందించి, భవిష్యత్ తరాలకు ఆహ్లాదకర వాతావరణం అందించాల్సిన అవసరం ఉందన్నారు. తడా పరిధిలో అవెన్యూ ప్లాంటేషన్ చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చట్టామని తెలిపారు. గ్రామీణ ప్రాంత వీధులలో రహదారులకు ఇరువైపులా చెట్ల నాటే కార్యక్రమానికి మెదటి విడతగా 1.25 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆదివారం ముత్యాలరెడ్డిపల్లిలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఆవరణలో చైర్మెన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా వీ.సి, హరికృష్ణ, కార్యధర్శి లక్ష్మీతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చెవిరెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకరవర్గం పరిధిలో మొదటిగా భారీ ఎత్తున చెట్లు నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మొక్కలు నాటిన తర్వాత కూడా మొక్కలు 3సంవత్సరాలు పాటు పరిరక్షించే బాధ్యత కూడా ఏపిఓలు, ఫీల్డ్ అసిస్టెంట్స్‌లు తీసుకోవాలన్నారు. నాటిన ప్రతి మొక్క బ్రతకాలని, మండల ఎంపిడిఓలు కూడా నిరంతరంగా పర్యవేక్షించి రోజువారి పురోగతి నివేదికలుగా తెప్పించుకోవాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో మొక్కల పెంపకంలో బాధ్యతగా వ్యవహరించిన సిబ్బందికి రూ.25వేల రివార్డుతో పాటు మేమెంటోతో సత్కరిస్తామని వివరించారు. కానుగ, వేప, చింత, రావి, నేరేడు, వెలగ, రేగు, బాదం, దేవగన్నేరు, ఆకాశమల్లి వంటి 13 రకాల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజిఎస్ ఉపాధి, ఎంపిడిఓలు, ఏపిఓలు, ఫీల్డ్ అసిస్టెంట్స్‌తో చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని పంచాయతీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# మళ్లీ పంచాయతీ ఖాతాపై కన్ను

## విద్యుత్ బకాయిలు పేరుతో ఆర్థిక సంఘం నిధులు లాగేసే యత్నం

## - ప్రభుత్వ మౌఖిక ఆదేశాలతో ఆందోళనలు సర్పంచులు

కోట, ఆగస్టు 21 ప్రభాతవార్త

మరో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు జమకానున్న నేపథ్యంలో ఏకకాల పరిష్కారంలో తాజా బకాయిలు చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే గ్రామ అభివృద్ధికి పెట్టిన ఖర్చులు, బిల్లులు, బకాయిలు అలాగే ఉన్నాయి. తమకు ఏడాదిన్నర కాలంగా బిల్లులు రాకపోవడంతో అత్యవసర పనులు చేసేందుకు ప్రజాప్రతినిధులు వెనకాడుతున్నారు. ఇక్కడే కాదు తిరుపతి జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఇలాగే ఉంది. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను కూడా లాగేసుకుందుందన్న ఆందోళన చెందుతున్న సర్పంచులకు రాష్ట్రప్రభుత్వం మరో ఝలక్ ఇచ్చేందుకు సన్నద్ధమైంది. విద్యుత్ బిల్లులు బకాయిలకు ఆర్థిక సంఘం నిధులు జమ చేయాలని ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు ఇస్తున్నారు. సర్పంచ్, కార్యదర్శి బ్యాంకు ఖాతాల్లో జమకానున్న ఆర్థిక సంఘం సొమ్మును విద్యుత్ బిల్లులకు ఏకకాల పరిష్కారంతో చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది జులైలో 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల ఖాతాల నుంచి రాష్ట్రప్రభుత్వం విద్యుత్ బకాయిలకు పూర్తిగా సర్దుబాటు చేసింది. దీంతో పంచాయతీల్లో నిధులు మిగులు లేక సర్పంచులు, ప్రజాప్రతినిధులు తాము చేసిన పనులకు బిల్లులు తీసుకోలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. కేంద్రప్రభుత్వం ఇచ్చే నిధులను రాష్ట్రప్రభుత్వం మళ్లించుకుంటుందన్న కారణంగా నేరుగా పంచాయతీలకు వాటిని జమ చేయాలన్న ఉద్దేశ్యంతో సర్పంచులు, కార్యదర్శుల సంయుక్త నిర్వహణలో బ్యాంకు ఖాతాలు తెరిచారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఇందులో జమ చేసే అవకాశం ఉంది. వీటిని రాష్ట్రప్రభుత్వం నేరుగా మళ్లించుకునే అవకాశం ఇప్పుడు లేకపోవడంతో ఏకకాల పరిష్కారం (ఓటీఎస్) పద్ధతితో విద్యుత్ బకాయిలు చెల్లించాలని నిర్దేశించింది. సర్పంచులు అంగీకరించకుంటే సంబంధిత పంచాయతీ రక్షిత పథకం, వీధిదీపాలకు విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని పరోక్షంగా ఆ శాఖకు సూచించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా ముందస్తుగానే విద్యుత్ కనెక్షన్లు తొలగించే ప్రయత్నంలో ఉన్నారు. ఇలా దారిలోకి తెచ్చుకోవాలని వ్యూహం పన్నుతున్నారు. నిధులు వచ్చాక జమ చేయిస్తామని అంగీకారం తీసుకుంటున్నారు.

## నేడు స్పందన

చిత్తూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త:

నగర ప్రజల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 10.30 గంటల నుండి స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగూ వార్డు సచివాలయ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి వార్డు సచివాలయంలో ప్రతి రోజు సాయంత్రం 3 నుండి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు హాజరై ప్రజల నుండి వచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని ఆమె కోరారు.

# బీఎస్-6 కొత్త వాహనాల తొమ్మిది సెన్సార్‌పై వర్క్‌షాపు



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 21 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లా మార్కెట్‌లోకి విడుదలైన బీఎస్-6 కొత్త వాహనాల తొమ్మిది సెన్సార్ల పనితీరుపై తిరుపతి టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ నేతలు, సభ్యులు, మెకానిక్స్‌కు వర్క్‌షాపు కెస్విన్, పృధ్వీ షోరూం ఇంజనీర్ నాగరాజు వివరించారు. సంఘం రాష్ట్ర అధికారి ప్రతినిధి ఆవుల మునిరెడ్డి కోరిక మేరకు కెస్విన్ టీవీఎస్ షోరూం ఉదయ్‌కుమార్‌రెడ్డి, డీఎం గురుప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గాంధీభవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు మునిరెడ్డి పేర్కొన్నారు. కమిటీ ప్రతినిధులతో పాటు ఒక్కొక్క బ్యాచ్‌కు 20 మంది చొప్పున మొత్తం 250 మందికి ఈ కొత్త వాహనం పనితీరుపై ట్రైనింగ్ పొందినట్లు చెప్పారు. ఇంజనీర్ల ద్వారా నేర్చుకున్న ప్రతి విషయాన్ని టూవీలర్స్ మెకానిక్స్ శిక్షణ పొంది పది మందికి నేర్పించడం వలన భవిష్యత్‌లో మెకానిక్స్ పనితీరు మరింత మెరుగుపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎన్.ఆర్ భాషా, సెక్రటరీ మల్లీశ్వరన్, జాయింట్ సెక్రటరీ కృష్ణారెడ్డి, కమిటి మెంబర్లు సురేష్, లక్ష్మణరావు, ఇంజనీర్ నాగరాజు, అసోసియేషన్ ప్రతినిధులు, మెకానిక్స్, తదితరులు పాల్గొన్నారు.

# నైరుతిలో వరుణుడి కరుణ అంతంతే ..

## తగ్గిన వేరుసెనగ సాగు !!



కుప్పం, ఆగస్టు 21 ప్రభాతవార్త

ఏటా ఖరీఫ్ సీజనులో నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలపైనే రైతులు అధికమంది పడమటి మండలాల్లో పంటలసాగు చేపడతారు. ముఖ్యంగా ఈ సీజనులో వేరుసెనగ పంట సాగును వర్షాధారిత పంటగా సాగు చేస్తారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్ సీజను ఆరంభంలో తొలకరి వర్షాలు బాగానే పలకరించినా అనంతరం రుతుపవనాల ప్రభావం తగ్గిపోవడంతో కుప్పం ప్రాంతంలో వర్షాల జాడ సైతం కొంత మేర తగ్గిపోయింది. గత మూడు నెలల్లో సాధారణ వర్షపాతాలు సైతం కుప్పం నియోజకవర్గంలోని పలు మండలాల్లో నమోదు కాలేదు. దీంతో రైతులు సాగు చేసే వేరుసెనగ పంట సాగు సైతం రైతులు ఆశించిన మేర సాగు చేయలేకపోయారు. కుప్పం మండలంలో సాధారణంగా ఏటా 2500 హెక్టార్లలో రైతులు వేరుసెనగ సాగు చేపడతారు. అయితే ఈసారి దాదాపు 600 హెక్టార్లు తగ్గి సుమారు 1900 హెక్టార్లలో మాత్రమే రైతులు వేరుసెనగ సాగు చేపట్టినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే వేరుసెనగ సాగు చేపట్టిన రైతులు కూడా పంటకు పూత పూసే సమయం అయిన నేపథ్యంలో ఇటీవలి కాలంలో వర్షాలు కురవలేదు. దీంతో పంట దిగుబడి సైతం ఈసారి చాలావరకు తగ్గుతుందని తెలుస్తోంది. ఏది ఏమైనా ఈసారి ఖరీఫ్ సీజను రైతులకు కొంత నిరాశే మిగిల్చింది.

# గణనాధుని సన్నిధిలో పలువురు ప్రముఖులు











కాణిపాకం, ఆగస్టు 21 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయస్వామివారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈమేరకు తమిళనాడు వేలూరు శ్రీపురం స్వర్ణ దేవాలయం వ్యవస్థాపకులు శక్తి నారాయణి అమ్మన్, రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి, భూగర్భ గనులు, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి ఆర్‌కె.రోజా, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, దేవాదాయశాఖ కమీషనర్ హరి జవహర్‌లాల్, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జడ్పీ ఛైర్మన్ జి.శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెలే ్యలు ఎంఎస్.బాబు, ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి, ఆలయ పునర్నిర్మాణ దాతలు గాయత్రీదేవి, ఐకా రవి, జానకి, గుత్తికొండ శ్రీనివాస్, పద్మజ, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ దంపతులు, బంగారు ధ్వజస్థంభం నిర్మాణ దాత హైదరాబాద్‌కు చెందిన మణి దంపతులు కాణిపాకం ఆలయంలో జరిగిన కుంభాభిషేకంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబులు రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించున్నారు. అనంతరం వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, రమేష్‌లతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.